
# పాము

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం



ఇప్పటి మాట కాదు. దాదాపు నలభై ఏళ్ళ క్రితం మాట!

అప్పుడు నా వయసు ఆరేండ్లు! ఆరేండ్ల వయసులోనే నా నూరేండ్ల జీవితం కొడిగట్టకుండా వుండటానికి అమ్మమ్మ పడ్డబాధ, బెంగ, తపన, ఆరాటం, ఇప్పటికీ మెదుల్తుంటాయి.

ఆరోజు

మునిమాపు వేళ, జాజి పందిరి కింద క్రీనీడలో గోలీలు ఏరుకుంటున్నాను. కాలికింద మెత్తగా తగిలింది. అంతలో బుస్సుమని శబ్దం వచ్చింది. అమ్మమ్మ ఎలా పసిగట్టిందో ఏవిటో మరి, అమాంతం రెక్కపుచ్చుకుని ఇవతలకి లాగింది. ఒక్కవూపులో మంచం మీదికి విసిరేసింది.

వారం రోజులపాటు చావుకి సమీపంగా వెళ్లటం రావటం పోరాటం జరిపేను. క్షణం క్షణం భయం! నీడలో ఒదిగేను. కాలు కింద పెట్టటానికి వీలులేకపోయింది. ఎవరన్నా 'రామం' అని పిలిస్తే చాలు.. తోకమీద నిల్చి ప్రత్యక్షమయ్యేది పాము! ఛీత్కారాలు చేసేది.! పడగవిప్పి పూనకం వచ్చిన వట్లుగా వూగిపోయేది. కళ్లలో విస్ఫు లింగాలు కురిపించేది.

దాని బారినుండి నన్ను రక్షించటానికి అమ్మమ్మ చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కాదు. ఇసుక మంత్రించి తెప్పించి ఇల్లంతా చల్లింది. అతికష్టం మీద గరుడపక్షి ఈకలు సంపాదించి మంచం కోళ్ళకి కట్టింది.

పాములు పట్టేనర్సప్పని ఇంటికి పిలిపించి పోషించింది. పాముల్ని కొట్టడంలో పేరుపొందిన దృఢకాయుల్నిద్దర్ని ఇంటిచుట్టూ గస్తీ తిరిగేలా ఏర్పాటు చేయించింది. విషానికి విరుగుడు మందు ఇంజక్షన్లు తెప్పించింది. ఓ ఆర్.ఎం. పి. డాక్టరుకి వీధి గది కేటాయించింది.

వారం రోజుల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతికేను. ఎంతోమంది వచ్చి పలకరించి వెళ్లేవారు. అమ్మమ్మ కళ్లలో నీరు నింపుకుని ..."ఈ వంశానికి మిగిలిన ఒకే ఒక నలుసు వీడు. ఎలా కాపాడాలో అర్థం గావట్లేదని భోరుమని ఏడ్చేది. వీడికోసమే బతుకుతున్నా'నని గిల గిలలాడేది.

ఎవరే సలహాలిస్తే అదెల్లా పాటించేది. పెరట్లో చెట్లన్నింటినీ కొట్టించేసింది. కలుగులోకి గాజు పెంకులు కూరించి సిమెంటుతో పూడ్పించింది. సుగంధ ద్రవ్యాలన్నింటినీ వీధివాకిట్లో పారబోసింది. కళ్ళలో వత్తులు వేసుకుని ఏమరక రాత్రింబవళ్ళు కాపలా కాసింది.

అమ్మమ్మ జాగ్రత్తల ప్రభావం - భూమ్మీద నాకు నూకలుండటం వలన... ఉప్పుజాడీ పక్కన చుట్టలు చుట్టలు చుట్టుకు పడుకున్న పాముని ఒకేఒక్క వేటులో చంపేశారు ఓ ఉదయాన్నే.

అనక తేలిగ్గా, దానినోట్లో రాగి పైసావుంచి దొడ్లోనే దహనం చేసేరు. ఆపూట అమ్మమ్మ ఆనందం ఇంతా అంతా కాదు. కనుకొలకుల నుంచీ మంచి ముత్యాల్లా నీటి చుక్కలు.గుండెల నిండుగా వూపిరి పీల్చుకుంది. ఓ నూతనోత్సాహం, ఉత్తేజం కలిగాయి.

ఒంటికి వెన్నరాసి తలంటిపోసింది. సాంబ్రాణి ధూపం వేసింది నాకు - అప్పుడు

ఒక పాము నుంచి రక్షించు కోవటానికి నన్ను అన్ని అవస్థలు పడింది అమ్మమ్మ! మరి ఇప్పుడు ఎన్నో పాములనుంచీ నన్ను నేను ఎలా రక్షించుకోవాలో అర్థం గావట్లేదు.

"మిమ్మల్ని ఏ. ఇ. గారు రమ్మంటున్నారు."

ఆలోచనల్లోంచి తలయెత్తి చూసాను. ఎదురుగా ప్యూను మంగపతి.


లౌక్యానికి మరోపేరు అతగాడు. సంగీతంలో ప్రావీణ్యం లేదుగాని, తాళం వేయటం బాగా తెల్సు! కాదు ఘటికుడు. చిన్నగా మాట్లాడటం, మెత్తగా నవ్వటం అతని నైజం!

సొరుగు తాళం వేసి కదిలేను. ఏ.ఇ.గారి ఛాంబరు శతావధాన వేదికలావుంది. రంగురంగుల ఫోన్లు వింత వింత వార్తలు మోసుకొస్తున్నాయి. నన్ను చూసి, ఫోనులో మాట్లాడ్తూనే చేతిలోని పెన్నుతో కుర్చీ చూపించాడాయన. కూలబడ్డాను. గుండెకి దడ తగిలినట్లు వుంది. భీకర జ్వాలాగ్నుల మధ్య లోహ సింహాసనం మీద చతికిల బడ్డట్లుగా ఉంది. వారంనుంచీ అనుభవిస్తున్న బాధ అది. జరుగుతున్న తంతే ఇది.!

"ఆ ఫైలు కనబడిందా?" ఎలుక నడుము మీద పిల్లి పంజావేసి పరిహసిస్తున్నట్లుగా - కుశల ప్రశ్నలు వేస్తున్నట్లుగా వుంది.

"సారీ!....లేదు"

"సారీ... అని రెండక్షరాలు అని వూరుకుంటే



# జన్మదిన కథల పోటీలోద్వితీయ బహుమతి 3,000/- గెలుచుకున్న కథ

ఎలా రామంగారూ? ఆ కాంట్రాక్టరు పైకి వెళ్తానంటున్నాడు. అప్పుడు జరిగే రచ్చ ఏమిటో మీకు తెలియుంది కాదు. అతగాడి ఐదువేళ్లు అసెంబ్లీలో ఉన్నాయ్."

ఆమాట అక్షరాలా నిజమే! ప్రాథమిక పాఠశాలలోనే పలుకుబడి సంపాదించుకున్నవాడు.

పలుకుపలుకులో పసిడి స్వరాలు ఉంటాయి. నాకు మళ్లీ బదిలీయో.... సస్పెన్షనో ఖాయం. ఆ విషయం నాకు తెల్సు.

ఎందుకంటే, వారంక్రితం నా టేబులు మీదకి వచ్చిందా ఫైలు. నేను సంతకం చేయలేదు. కారణం... నా దౌర్భగ్యం అనబడే నా బలహీనత కావచ్చు. లేదా రెగ్యులర్‌గా నేను కాలవ పక్కనుంచి ఆఫీసుకి రావడం కావచ్చు.

ప్రధానమైన కాలవ పూడిక తీసే కాంట్రాక్టుని ఆయనకిచ్చేరు. నెలరోజులు జరిగిపోయినా కాల్వ పూడిక తీయలేదు. బిల్లుకోసం మాత్రం ఫైలు



## ద్వితీయ బహుమతి రు.3,000/- పొందిన 'పాము' కథా రచయిత శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

పుట్టింది తెనాలిలోని పినపాడు. పెరిగింది బందరులో. పెంచినది జగమెరిగిన కథకుల్లో ఒకరు - మావయ్య శ్రీ విహారి. బహుశా ఆయన దగ్గర పెరగటం వలన, నేను పుట్టి పెరిగిన గడ్డల తీరువలన కావచ్చు నా కీ మాత్రం సంస్కారం అబ్బటం.

గత అయిదేళ్లుగా కలంపట్టి సాహిత్యపు బాటలో నే వేసిన అడుగులు ఓ పాతిక కథలు, ఓ నవలిక మాత్రమే! నా తొలి కథను ప్రచురించింది 'మయూరి' వార పత్రిక.

మరో ముఖ్యమైన మాట - బహుమతి రావడం ఇదే మొదటిసారి. హాబీలంటూ ప్రత్యేకంగా ఏవీ లేవు కానీ, అలతి అలతి పదాలతో అల్లిన కథలంటే ఇష్టం!

అడుగడుగునా వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న అన్నలాంటి దండురాజా గారికి 'ప్రభ' ముఖంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నా!

చివరి మాట - బహుమతి నిచ్చి ప్రోత్సహిస్తున్న 'ఆంధ్రప్రభ' వారికి విశేషమైన కృతజ్ఞతలు మరోసారి తెలియచేస్తున్నా.

**జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, దండురాజు ట్రేడర్స్, శివాలయం వీధి దగ్గర, సత్యనారాయణపురం, విజయవాడ - 11.**

టేబులు మీద కొచ్చింది. అందుకే సంతకం చెయ్యలేదు.

ఓరోజు మా ఇంటికి వచ్చాడుఆయన.

సూటిగా విషయం చెప్పాను. పూడికలు తీయనందువలన కలిగేనష్టం వివరించేను. కాలవగట్ల వెంట ఆక్రమించుకుని ఇల్లుకట్టుకుని బ్రతుకుతున్న బీదా బిక్కి చిన్నవాళ్లు ముంపు వస్తే ఎలా బలైపోతారో ఆయనికి తెలియనిదేమీ కాదు. ఆయనేం బుసకొట్లేదు. ముఖం లేత ఉదారంగులోకి మార్చుకుని మెత్తగా నవ్వి వెళ్లాడు.

ఆ తర్వాత రెండు రోజులు మామూలుగా గడిచిపోయినై. మూడోరోజు నుంచీ ఫైలు కనిపించడం మానేసింది. అక్కడా... ఇక్కడ పుకార్లు కూడా లేచాయి. వాటా కుదరక నేనే ఫైలు మాయం చేశానని.

ప్రతిరోజూ ఏ.ఇ. గారు పిలుస్తాడు. సతాయిస్తాడు. లేవరానిచోట పుండు లేచింది. మేనమామ మందువేస్తానని ముందుకు వచ్చేడు. చెబితే మానంపోతుంది. చెప్పకుంటే ప్రాణం పోతుంది. అదీ పరిస్థితి!

ఓ రెండు గజదండలు మెడలో వేయించుకుని.

అరుపుల ఫ్లవర్సు బొకేలు దోసిలిపట్టి. కోడిగుడ్డు మీద పడ్డ ఉపన్యాసకుడు వేదిక దిగినట్లుగా నా సీటులోకి వస్తాను.

ఆఫైలు ఎలా మాయమైందో. ఎవరు మాయం చేశారో అద్దంలో మొహంలా అంతా నాకు తెల్సు. ఆధారాలు శూన్యం. నా వెనుక మంగపతి గుంభనంగా నవ్వటం. వెన్నలో కారం కలిపి ముఖానికి పూసినట్లుగా ఉంటుంది. సిరంజిలో మందుకు బదులుగా క్రిముల్ని ఎక్కించి నరానికి ఇంజెక్టు చేసినట్లుగా ఫీలింగు కల్గుతుంది.

బుస కొట్టని మెత్తని పాములు!

క్షణం క్షణం కుబుసం విడిచే పాములు!

వొళ్ళంతా విషం నింపుకున్న ఉరగాలు!

బొరుసు తప్ప బొమ్మలేని నాణాలు!

వాళ్ళవి 'నీతి' బతుకులు!

నేను అవినీతి మనిషిని!

* * *

గుమ్మంలో సైకిలు దిగేటప్పటికి లోపల్నించీ శారద గొంతు తారే స్థాయిలో వినబడుతున్నది. మళ్ళీ ఏదో జరిగింది అనుకున్నాను. సైకిలు స్టాండు వేసి లోపలికి నడిచేను.

'వ్రేటువడ్డ యురగాంగన'లా వచ్చింది శారద. చెయ్యి అంది పుచ్చుకొని పెరట్లోకి లాక్కెళ్ళింది. రోజూ ఉన్న తంతే అది. కిందనుంచి రక్తం తోడేస్తున్నట్లుగా ఫీలవుతుంటాను. రెండుకాళ్లు మడిచి పీకదగ్గిరికి తెచ్చి ఉరేసినట్లుగా చీకాకు పడుతుంటాను. గత రెండేళ్ళ నుంచీ ఇదీ సలపరం.

అక్కడ...

బావి చప్టాకి ఆవలగా పక్కింటివారు వంపిన పీతడెక్కలు - రొయ్యముళ్లు. వాటిచుట్టూతా - లుకులుకలాడే పురుగులు. వాటికోసం బాదం చెట్టుమీద చేరిన కాకులు కావుకావులు. గోడదూకి వచ్చే వీధి కుక్కల భౌ...భౌలు. విమాన ప్రొఫెల్లర్ శబ్దంలా ఝుంమ్మనే ఈగలు!

"పెరటిలో ఏవన్నా దినుసులు ఆరబోయాలంటే భయంగా వుంది. అక్కడ ఎంగిలి మంగలంలో ముక్కులు పెట్టిన కాకులు ఇక్కడ వీటిని కెలుకుతున్నై. మొన్నటికి మొన్న నెలకి సరిపడతెచ్చిన గోధుమరవ్వ గోడ అవతల పారపోయాల్సివచ్చింది. నిన్న వడియాలు ఎండబెడితే పట్టామీద బొమికలున్నై. చచ్చినట్లుగా ఎత్తిపోసి వచ్చి తలారా స్నానం చెయ్యాలి" శారద కష్టపెట్టుకుంది.

శారద పద్ధతే అంత! నేను కూడా అంతే! కానీ నేను కొంచెం గుంభన పాటిస్తున్నాను. మొన్న గోంగూర పులుసులో కోడికాలి బొమిక వచ్చింది. శారదకి అబద్ధం చెప్పాను. మునగ కాడముక్కని. అపైన బాత్‌రూంలోకి వెళ్లి వాంతి చేసుకున్నాను.

వారు కావాలని మా పెరట్లోకి పోయటంలోని ఆంతర్యం ఏమిటో నాకు తెల్సు. మేము విసిగి అమ్ముకొనిపోవాలని. వాళ్ళవాళ్ళని అక్కడ చేర్చాలని.

పల్లెలోని అరెకరాల మాగాణి. లంకంత కొంప హరించుకోనిపోగా మిగిలిన చిల్లర కాసులతో ఈ కొంప కట్టుకున్నాను. పిత్రార్జితంలానే భావిస్తున్నాను. అందుకే మమకారం చావటంలేదు.

అమ్ముకుపోవటానికి మనసొప్పి చావటంలేదు. అందుకే మొండికి పడ్తున్నాను.

విసిగి విసిగి మేము ఛావాల్సిందే. వాళ్ళేం సంజాయిషీగా కిమ్మనరు. కనీసం'అమ్మో పాపం' అనుకోరు. "మేమెందుకు పోస్తాం సారూ? కాకులు చేసే పని ఇది" అంటారు. మంట నషాళానికి అంటుతుంది. వీపు పెరటిగోడమీదనుంచీ దబుక్కున వంచుతారు. ఇంకాస్త గొడవ పడితే 'మీకు చేతనైంది చేసుకోండంటారు..

ఓసారి అక్కడితో ఆగలేదు. 'కులం-మతం' పేరెత్తి తిట్టామంటూ పోలీసుకేసు పెట్టారు. మొగ్గుండ్ని కొట్టి మొగసాలకెక్కిన చందాన. నూటాయాభైరూకల చమురు వదిలించుకుని సాయంత్రానికి స్టేషను నుంచీ బైటపడ్డాను.

శారద - చీపురుతో వాటన్నింటినీ ఎత్తి, సందు దారిలోంచి వెళ్లి వీధి కుండిలో పారబోసి వచ్చిందిలా ఉంది. చీపురు కడిగి - బావి చప్టా మీద తలారా స్నానం చేస్తున్నది.

ఇక్కడా - ఒళ్ళంతా విషం నింపుకున్న మెత్తని ఉరగం!

బుసకొట్టని మెత్తని పాము!

క్షణం క్షణం కుబుసం విడిచే వింతపాము!

లౌక్యం పాముని మెడ చుట్టూ వేసుకున్న గరళ కంఠులు!

పడక్కుర్చీలో కూలబడ్డాను. నెత్తుటి చారికలు లాంటి ఆఫీలు సంఘటనలు- కొరడా దెబ్బల్లాంటి పరిస్థితులు - పరిసరాలు కుళ్ళిన పండులోంచి పురుగుల్లా దొలుచుకొస్తున్నై.

గాజుల చప్పుడికి తలయెత్తి చూశాను. వంటింటి గుమ్మంముందు చీర కుచ్చిళ్లు పోసుకుంటున్నది శారద. తలకి పిడప చుట్టుకుని వుంది.

"వాడింకా రాలేదు" అంది.

గోడగడియారం ఆరుగంటలు కొట్టింది.

పడక్కుర్చీ కిరకిరలాడింది.

వాడంటే నా పుత్రరత్నం. ఆవుచేలో మేస్తుంటే దూడ గట్టున మేయదనటానికి చక్కని నిదర్శనం వాడు. వచ్చేడు. తలంతా ఎరుపు రంగు పూసుకున్న తాటి టెంకలా వుంది.

"మళ్ళా ఏమైందిరా?" శారద పొలికేక లేసి ఒక్క అంగలో వాడిని చేరింది. ఎక్కడో హత్యచేసి సరాసరి ఇంటికి వచ్చినట్లుగా వుంది వాడి వాలకం. చేతులు, బట్టలు రక్తంతో తడిసి సంధ్యవేళ చిరువెలుగులో భూత మాంత్రికుడిలా కన్పిస్తున్నాడు.

"ఏమైందిరా?" శారద రెట్టించింది.

"కనబడటంలే!" చిరాగ్గా చెప్పి బాత్రూంలోకి వెళ్ళాడు వాడు. "నేను వేగలేకపోతున్నాను. ఈ పరిస్థితులకి ఇమడలేకపోతున్నాను." ఘొల్లుమంది. నుదురు బాదుకుంది.

అరగంటకి బాత్రూంలోంచి బైటకి వచ్చేడు.

బల్లముందు కూర్చుని పుస్తకాలు తీసుకుంటున్నాడు. శారద వంటింటి మండిగానికి జారగిలబడింది పడక్కుర్చీలో నేను, ముక్కోణంలాగ. విక్రమార్కుడి సింహాసనంమీద సాలభంజి కల్లా!

కరెంటు చీకటిని మింగేస్తున్నది.

"ఏం జరిగిందో చెప్పిఛావకుండా గోడకి కొట్టిన తీగమేకులా బిగుసుకుఛస్తావేం?" శారద అరిచింది.

"ఏంచెప్పమంటావు? ఈ తప్పు నీదేనని చెప్పమంటావా? లేక మనకి ఆదర్శాలుగా వల్లిస్తున్న పురాణాలది అని చెప్పమంటావా? చిరాకుపడ్తున్నాడు.

"అదీ... ఏదో సరిగా చెప్పితగలడు" శారద తిట్లు.

చలనంలేని బొమ్మకి చెవులున్నట్లుగా నేను.

"ఆనాడు జిజియాబాయి శివాజీని ఒళ్ళోకి తీసుకుని రామాయణం- భారతం చెప్పింది. శివాజీని ఆదర్శప్రాయుడిగా తీర్చిదిద్దింది అంటే ఆనాటి పరిస్థితులు అలాంటివి. ధర్మకాలం! మరి ఈనాడు అధర్మకాలం! ధర్మరాజులా వున్నందుకు హరిశ్చంద్రుడిలా పలికినందుకు, రాముడిలా మాటమీద నిలబడినందుకు ప్రతిఫలం ఇది!

"పరీక్ష హాల్లో - వెనుక సీట్లో వున్న చిట్టిగాడు పేపరు చూపించమన్నాడు. చూపించలేదు. టీచర్‌కి చెప్పాను. దాని ఫలితం ఇది. దారి కాయించి కొట్టించేడు."

"పోలీసు కంప్లైంటు ఇవ్వాల్సింది!"

"ఎవరిమీదని ఇస్తాం అమ్మా! కొట్టిన వాళ్ళెవరో నాకు తెలిస్తే కదా" ఉద్రేకపడ్తున్నాడు వాడు.

ఇక్కడా విషసర్పమే! ఒళ్లంతా లౌక్యం నింపుకున్న ఉరగం. బుసకొట్టకుండా, మూతికి రక్తం అంటకుండా కాటువేసే పాము! మెత్తగా గొంతుమీద కాటువేసే గమ్మత్తయిన ఉరగం!

భోజనాలైనాయి.

వంటిల్లు సర్దుకుంటున్నది శారద.

పక్కమీద నడుం వాల్చాను. ఆమధ్య ఎప్పుడో సెకండ హాండ్ మార్కెట్లో దొరికిన పుస్తకం తెరిచాను.

అది...భారత రాజ్యాంగంలో పౌరుని విధులు. ప్రాథమిక హక్కులుకి తెలుగు అనువాదం.

పుస్తకానికి - జీవితానికి పొంతన కుదరటంలేదు. అక్కడక్కడ పుస్తకానికి పట్టిన చెదకి ఏవన్నా జీర్ణమైందేమో నాకు తెలియదు.

శారద ఎప్పుడు పక్కచేరిందో నాకు తెలియదు. ఓరాత్రివేళ ఎవరో తలుపు తడ్తూవుంటే మెలుకువ వచ్చింది. లేచిలైటు వేసి తలుపు తీసాను. ఎదురుగా అల్లుడు, అమ్మాయి.

వసివాడిన గన్నేరు పూవులా వుందది.

హేంగరుకి తగిలించిన టైలా వున్నాడతగాడు.

లోపలికి కూడా రాలేదు అతను. కనీసం కాళ్లు కడుక్కోలేదు.

మంచినీరు తాగలేదు. 'శెలవులేదంటూ' గోడకి చెప్పినట్లుచెప్పి అప్పటికపుడే గుమ్మం దాటేడు.

ఆరాత్రి కాళరాత్రే అయింది.


శారద గుండె చెరువైంది. అది చెప్పిన విషయం విన్న దగ్గిర్నుంచీ. నవరంధ్రాలకీ మిరియాల కషాయం పోసినట్టుగా వుంది.

మామూలుగా తెల్లారింది. పాములు వేటకి బయలుదేరాయి. నాలాంటి కప్పల బెకబెకల సందడి ప్రారంభమైంది.

## దశమ గ్రహం !

దశమ గ్రహం కనుగొన్నారు కదా! దాని గురించి మీకు తెలుసా? సూర్యునికి 16,000 కిలోమీటర్ల నుంచి 32,000 కిలోమీటర్ల దూరంలో ఒక కొత్త గ్రహం తిరుగుతున్నదనీ, ఇది సూర్యునిచుట్టూ తిరిగి రావడానికి 700 సంవత్సరాలు పడుతుందని శాస్త్రజ్ఞులు అనుకుంటున్నాను. ఇది మన భూమికన్నా అయిదు రెట్లు ఎక్కువ బరువుండవచ్చునని భావిస్తున్నారు. దీన్ని కల్కి అవతారం పేరిట 'కల్కి' అని పిలవాలనుకుంటున్నారు. దీన్ని ప్లానెట్ 'ఎక్స్' అని కూడా అంటున్నారు.

సేకరణ : మహ్మద్ హుస్సేన్ [మహబూబ్‌నగర్]



ఆఫీసుకి చేరుకోగానే సత్యం తన విచారం వ్యక్తచేశాడు. తన చేతులు మీదుగా సస్పెన్షను ఆర్డరు ఇవ్వవలసి వచ్చినందుకు నొచ్చుకున్నాడు. చిరునవ్వుతో స్వీకరించేను. టిఫిను బాక్సుని తిరిగి సైకిలుకి తగిలించి బయలుదేరుతుంటే-సత్యం చేయి వేశాడు సానుభూతిగా భుజంమీదా.

"ఈవేళ కాకపోతే రేపు! పదేళ్ళకైనా నీనిజాయితీ ప్రభుత్వం గుర్తిస్తుంది. నీకు మళ్ళా మంచిరోజులొస్తాయి. నా నమ్మకం. కోర్టుకి వెళ్ళటం మాత్రం మరిచిపోకు!" అన్నాడు. సత్యం ఓ చిత్రమైన మనిషి... తనో పెద్దకవినని గొప్ప నమ్మకం అతనికి

"పోరాడు పోరాడు కడదాకా!

రక్తం గడ్డ కట్టినా

కత్తిమెడమీద నిలిచినా

పోరాడు పోరాడు కడదాకా!"

లయబద్ధంగా పాడాడు.

అదో ఊరట. మండుటెండలో శీతాంశురేఖలా.. జస్ట్ రిలీఫ్. ఓ గొప్ప నమ్మకానికి పునాది. నాకు తెల్సు. కోర్టుకి వెళితే పదేళ్లు పట్టవచ్చు. నాజీవిత కాలమైనా పట్టవచ్చు. ఆ తర్వాత ఏదో జరగవచ్చు అంతవరకూ. అసలే మిట్టపల్లాలమీద సాగే బతుకుబండి ...యుద్ధంలో కర్ణుడి రథచక్రంలా కూరుకుపోతుంది. ఇప్పటిదాకా బతుకుబాటలో తారసపడ్డ పల్లేర్లు, జిల్లేళ్ళు రేపు బాకులుగా -మేకులుగా మారి చీకాకుల వలయంలో నిలిపి ఛిద్రంచేస్తాయి.

శారద ఏడుస్తోంది.

ఇలాంటి మొగుడ్నీ, అలాంటి కొడుకునీ ప్రసాదించినందుకు భగవంతుడ్ని శాపనార్థాలు పెడ్తున్నది. అలారంలోని పన్నెండు స్థానంలోకి ఇరవై నాల్గుని, ఆరుస్థానంలోకి పన్నెండిని మార్చి, అక్కడో అంగ - ఇక్కడో అంగవేసి తనో అలారంలా మారుతుంది.

అంత బాధలోను కించిత్తు ఆనందం వేసింది. 'రెస్టు రేటు' పెరిగిందని. సరదాగా కాఫీ తాగాలనిపించింది. మొన్న నెల జీతాల్లో నా సాదరుఖర్చులకోసం శారద కేటాయించి ఇచ్చిన స్వల్పమొత్తం ఎందుకో. బరువుగా హోటల్లోకి దూరేను.

టేబులు దగ్గర చతికిల బడగానే సర్వరు అడిగేడు. "ఆవడ తెమ్మంటారా సారూ?.... పెరుగులో ఐసు కూడా కలిపేము"

అవును...'వడ'లో 'ఆవడ' బెస్టు. తింటుంటే ఏదో ఫీలింగు,కత్తి అంచుమీద నిలబెట్టింది. ఏదో బెంగ పీకని మెలివేయడం ప్రారంభించింది. మరో గ్లాసు ఐసు వాటరు తాగి, బిల్లు చెల్లించి బైటికి నడిచేను. అపుడు ప్రారంభమైంది, వేదన పరివేదన.

చీకటి పడింది.

మనసులో చీకటి అలుముకుంది. ముసురు కమ్మిన నాటి సూర్యుడిలా కుములు ప్రారంభమైంది. చీకట్లో నీడలా కలిసేడు రాజారాం. రావటం'నేనో సలహా చెప్తా'ననిపించింది రామూ' అన్నాడు.

''ఏవిటి'' అన్నాను నిర్లిప్తంగా.

"మరోలా భావించకు. అయిన వాడి గంధంచెక్క కంటె కానివాడి టేకు ముక్క ఆశించడంలో తప్పులేదు. బెటరన్నది నానమ్మకం.

"ధర్మాన్ని నమ్ముకుని రాముడు - మాటమీద నిలబడి హరిశ్చంద్రుడు అడవులపాలైనా ఆరోజులు వేరు. అడవుల్లో తింటానికి కందమూలాలైనాదొరికేయి వారికి. మరి మనకి అలాకాదే... ఆలుబిడ్డల్ని తీసుకుని ఏ అడవికి వెళ్తాం.? అడవుల్లో కూడా కంద మూలాలు దొరకటంలేదు. అసలు అడవులే వుండటంలేదు. జనారణ్యాలే గతి. కోరి సూదితో తలమీద పొడుచుకోవటం అవివేకం. నువ్వు 'ఊ' అంటే ఉదయాన్నే వస్తాను. కొంట్రాక్టరుగారింటికి వెళ్దాం. సారీ రెండక్షరాలను అక్కడ, చాలు....!"

ఒక్కసారి లొంగిన ఆడదానిమీద జీవితాంతమూ హక్కు పొందినట్లే మగాడు. ఇంగితం తెలియని వాడ్నికాను.

'సారీ...' రెండక్షరాలు వాడేను.

ముఖం మామిడిపండు రంగులోకి మార్చుకుని వెళ్ళిపోయాడు రాజాయి.

అన్ని పాములూ 'తలెత్తాయని' వానపాము కూడా తలయెత్తిందట. లేకపోతే రాజరాం నాకు సలహా ఇవ్వడం ఏమిటి? అతని సంగతి ఎవరికి తెలియదు. ఏ.ఇ.గారి బూట్లు పాలిష్ చేయటం, ఇ.ఇ. గారి బొచ్చు కుక్కని వాహ్యాళికి తీసుకవెళ్లడం. ఎస్.ఇ.గారి చొక్కాకి బొత్తాలు కుట్టడం... అతనిది పిడికెడు మనస్తత్వ ం! పిడికెడు బ్రతుకు.

"దీని పరిస్థితి ఏమిటి" అడిగింది శారద. శారదకి ఇంకా విషయం చెప్పలేదు. "చూద్దాం" అన్నాను. తెల్లవార్లూ శారద సణుగుతూనే వుంది. బతుకు బండమీద పగిలిన సీసం పెంకుల్లాంటి సంఘటనల్ని ఏకరువు పెడ్తునేవుంది.


పిల్లపోయినా పురిటికంపు పోలేదన్నట్లుగా పెళ్లిచేసి అత్తవారింటికి పంపినా బాధ్యత- అడపాదడపా పోషణతప్పటంలేదు. నెత్తిమీద అమ్మోరు కూర్చుంటే

## సంగీతం వినిపించే పత్రిక !

సంగీతం వినిపించే గోడ గడియారాలు, గ్రీటింగ్ కార్డులు, వాక్యూమ్ హారన్‌లు ఇటీవలికాలంలో వచ్చాయి.

హంగేరీలో 'ఎబెండ్ మాగజైన్' అనే పత్రిక వార్తలతోపాటు సంగీతం కూడా వినిపిస్తుంది. వాటిలో కొన్ని పేజీలపై మాత్రమే ధ్వనితరంగాలను మాత్రమే ప్రచురిస్తారు. పాఠకులు ఆ సంగీత పేజీలను గ్రామఫోన్ రికార్డులుగా ఉపయోగించుకోవచ్చు. ఈ పేజీలు మిగతా పేజీలకంటే మందంగా ఉంటాయి. పేజీల మీద చదివే పాటలు గ్రామఫోన్‌ల ద్వారా వినవచ్చును.

సేకరణ : 'సవ్యసాచి' [కర్నూలు]



చంకల్లోంచి కూడా రక్తం వస్తుందట!

• • •

ఘనంగా ఆహ్వానించేడాయన. "చాలా రోజులైంది తమరు రాక..." వినయ పూర్వకంగా కూర్చీ చూపించేడు. "మిమ్మల్ని నమ్మకపోతే ఎలా సారూ? నన్ను నేను నమ్మకపోవటమే"లాంటి బుసలు వినిపించేడు. డ్రింకు తెప్పించేడు. దస్తావేజుల్ని కళ్లకద్దుకుని భద్రంగా ఇనప్పెట్టిలో దాచుకున్నాడు. జేబులు బరువు చేరి సాగనంపేడు.

నే నా బరువు శారద చేతిలో దించేను. అది అమ్మాయి చేతిలో పోసి తెరిపిన పడింది. అమ్మాయి కళ్ళలో నీలాంబరాలు పూసినై. మెతుకులు మింగుడు పడక(ఆనందంతో) ఏదో కతికింది.

నాకు మెతుకు దిగలేదు బాధతో. శారదకి మింగుడు పడలేదు. దిగులుతో... అప్పటి కప్పుడే ప్రయాణమైంది అమ్మాయి. శారదకూడా వెళ్లి దించి సాయంత్రానికి తిరిగి వచ్చింది.

మర్నాడు శారద చెప్పింది కాఫీ ఇస్తూ... "ఎందుకో అతని ప్రోద్బలంకన్నా, అమ్మాయి పట్టుదల కోసం వచ్చినట్టుంది. తంత్రం మొత్తం దీనిదల్లే వుంది."

నిర్లిప్తంగా నవ్వేను

గాటు కనబడకుండా కాటు వేసే పాములు!

నిలువెల్లా చుట్టేసి ఊపిరాడకుండా చేసే పాములు!

"ఇందుగలవందులేవని సందేహము వలదు. ఎందెందు వెదకి చూచిన అందందేగలదు లౌక్యం పాము" రాగయుక్తంగా విషాదరాగం ఆలపించాల నిపించింది.

వంటింట్లో ఆలస్యమై పోతున్నదని సర్కస్సు ఫీట్లు, విన్యాసాలు చేస్తుంటే ఐసు ముక్కలా విషయం చెప్పాను.

ఒకదానిమీద ఒకటి బోర్లించి పేర్చిన ఇత్తడి పాత్రలు బడబరా దొర్లినట్లు లబలబలాడింది శారద. వాగులు, సెలయేర్లు ఏనాడో ఇంకిపోయాయిలా వుంది. వర్షించిన తదుపరి మేఘంలా నిస్తేజంగా మారింది. కడపటి చుక్క రాల్చినట్లు కొలుకుల చివర బొట్టు మెరిసింది.

'సంచార జీవనం చేస్తూ చెట్లకింద బతికే వారిక్, మనకుతేడా లేకుండా పోయింది. రాష్ట్రంలో తిరగని వూరంటూ లేదు. నికరంగా పట్టుకుని సంవత్సరం వున్నది లేదు. ఇప్పుడాబెంగలేకుండా చేసేరు." అంది.

**[వచ్చేవారం: తృతీయ బహుమతి పొందిన కథ: 'సృష్టికర్త ఆవేదన !' కాలువ మల్లయ్య]**

వ్యంగ్యం గంగిగోవు పాలమీద ధూళి కణమని ఆమెకీ తెల్సు. నాకూ తెల్సు.

అదిగో...అపుడు వచ్చింది

శంకరం నుంచి టెలిగ్రాం. "ఐహేట్‌యూ" అంటూ, నాపంథా నచ్చలేదంటూనూ. వాడు శారద తమ్ముడు.

వాడికి రెండు చేతులూ చాలటంలేదట. ఎందుకో నాకు అక్కడ బతకబుద్ధికాదు. అందుకే ఏ శుభ కార్యం జరిగినా వెళ్లను. శారద,పిల్లలు వెళ్లివస్తారు. వాళ్ళు వచ్చిన దగ్గర్నుంచీ రెండు మూడు రోజులపాటు మనసులో ఉక్కపోత పోస్తుంది. గొంగళి పురుగులా కుంచించుకుపోతాను. కుమ్మరి పురుగులా ఏదో భావం దొలుస్తూ వుంటుంది. కత్తితో స్నేహం చేసినట్టుగా ఫీలవుతాను.

వారంరోజులు గడిచిపోయాయి.

పాతపుస్తకాల షాపులో కొన్న పుస్తకం చదివేను. మెదడు కాటా పనిచేయటం మానేసింది.

హఠాత్తుగా ఓ రాత్రివేళ శంకరం వూడిపడ్డాడు. సర్వం సహా అఖండ భూమండలాన్ని తన అశేష శేముషీ విభవంతో చక్రం తిప్పుతున్న మంత్రి వర్యుడిలా పోజు ప్రారంభించేడు.

"నా తిప్పలేవో నేను పడ్డాను. కాళ్లమీద పడి ప్రాధేయ పడ్డానో... చేతులే పట్టుకున్నానో... లింకులోనే ఇరికించేనో... అవన్నీ నీ కనవసరం. రేపట్నుంచీ ఆఫీసుకు వెళ్లుపీ.ఇ.మాట్లాడడు. కొంట్రాక్టరు నీ దగ్గరికి రాడు. రేపోమాపో తాతవి కాబోతున్నవాడివి. పిల్లచేష్టలు మానుకో. గుట్టుచప్పుడు కాకుండా నాలుగురాళ్లు వెనకేసుకోవడం నేర్చుకో. ఇష్టం లేకపోతే మడికట్టుకో. అది నీ ఖర్మ! మా అక్కయ్య ఖర్మ. అందరూ మడి కట్టుకోవాలనుకుంటే ఎలా... నీ పంథా మార్చుకుంటే మంచిది."

ఇంకా చాలా చాలా మాట్లాడి మరోగంటకి కారులో తుర్రుమన్నాడు.

శారద మీద కోపం వచ్చింది.నాకోపం శారదని ఏమీచేయదు. శారద పది వేళ్లు కూడా పటిష్టమైనవే. నన్నే కత్తి అంచుమీదకి తోసి వాళ్లు హాయిగా వున్నారు. వెళుతూ... వెళుతూ శంకరం అన్నమాటలు చెవులలో గింగురు మంటున్నై."మహాభుజంగానికి వానపాములు ఎదురొడ్డటం ఎలాంటిదో... నీపద్ధతి కూడా అదే."

అమ్మమ్మ మీద మొట్టమొదటిసారిగా కోపం వచ్చింది.

అనాడు-తోక తొక్కిన నేరానికి పగబట్టిన తాచు బారినుంచీ రక్షించి, ఈ పాముల పాల పడేసిన ందుకు!

నేను ఆఫీసుకు వెళ్ళలేదు.

శారద గునుస్తూనే వుంది.

అపుడు వచ్చారు వెంకుబాబు, చిట్టి. మావాడి క్లాసుమేట్లట!" అంకుల్, మేమేదో వాడిని కొట్టించామని అపోహ పడ్తున్నాడు మీ శ్యాం. మాకేం అవసరం చెప్పండి. చదువుకునేవాళ్లం. మేమేం రౌడీలం కాదు. గూండాలం కాదు. తల్లి ప్రమాణంగా మాకేం తెలియదు. అసలాపూట పరీక్ష అవ్వగానే ఫిజిక్సు లెక్చరరుగారితో కల్సి వారింటికి వెళ్లాం ట్యూషన్‌కి. కావాలంటే వచ్చి అడగండి" వెళ్లిపోయారు వాళ్లు.

నాకళ్ళముందు... క్షణం క్షణం కుబుసం విడుస్తూ రంగులు మార్చు కుంటున్న పాములు మెదుల్తున్నై. ఎద్దేవా చేస్తున్నై. శరీరం మంట పుట్టకుండా, పోలీసువారి దెబ్బల్లా, చల్లని విషాగ్ని కీలలు కుమ్మరిస్తున్నై.

మరో జనమేజయుడు పుట్టి మరో సర్పయాగం చేయాలేమో?

సాయంత్రానికి నేనేం చేయాలో నిర్ణయించుకున్నా. చేతిలోని రవ్వపొట్లాలు, మినపప్పు చూసి శారద బిత్తరపోయింది.

అవును! స్వతంత్రంగా బ్రతకటంలో తప్పే ముంది.? శ్రమ జీవికి జగమంతా లక్ష్మీకటాక్షం అన్నారు.

ఆతర్వాత-

- రెండు రోజులకి.

శంకరం దగ్గిర్నుంచీ ఫోను వచ్చింది. పరువు తక్కువ పనులు చేయవద్దని. అవసరమైతే తను నన్ను కూర్చోబెట్టి పోషిస్తాడు.!

ఇదో విషసర్ప పరిష్వంగం!

అంతా చికాకుగా వుంది. జుత్తు పీక్కోవాల నిపిస్తోంది. అద్దం ముందుకు వెళ్ళి నిలబడ్డాను కాకతాళీయంగా! చిత్రం! అద్దంలో నా ప్రతిబింబం కనిపించటంలేదు. దానిస్థానే మిడిగుడ్లు వేసుకుని రోకలి ఎత్తు పాము విన్యాసాలు చేస్తున్నది.

ఆపాము ఏమిటో అర్థమైంది...

అది నా...

అహం!

ఇంత పెద్ద పాము ముందు మిగిలినవన్నీ వానపాముల్లా తోస్తున్నై! ●